క్లుప్తంగా

నేటి నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ చిట్టివలస, తగరపువలసలో జీఆర్‌పీ పైప్‌లైన్‌కు బదులు 350 ఎంఎం డయా పైప్‌లైన్ వేస్తున్నందున భీమిలి పట్టణానికి సోమ, మంగళవారాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జెడ్డీస్ బి.రాము తెలిపారు. గోస్తనీనది తీరాన కొండపేట పంప్ హౌస్ నుంచి భీమిలిలోని 450 కేఎల్, 800 కేఎల్ రిజర్వాయర్లకు ఈ పైప్‌లైన్ ద్వారా తాగునీరు సరఫరా అవుతుంది. ఈ కారణంగా ప్రత్యామ్నాయంగా భీమిలి పట్టణానికి రెండు రోజులపాటు ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటి కోసం హరి 63003 89896, త్రినాథ్ 98660 46100ను సంప్రదించాలని జెడ్డీస్ రాము సూచించారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులివ్వాలి

విశాఖ విద్య: ఆడుదాం ఆంధ్రా విజయవంతంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆముదాల అప్పలరాజు కోరారు. ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేలా ఆడుదాం ఆంధ్రాకు శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను ఇనుమడింపజేయడానికి ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాత్ర ఎంతో ఉందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సెలవు రోజుల్లో పనిచేసిన కాలానికి ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎల్. లలితకుమార్, కోశాధికారి ఎన్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీరామ శోభా యాత్ర

భీమునిపట్నం: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సోమవారం భీమిలిలోని రామ భక్తులంతా శ్రీరామ శోభా యాత్ర భారీగా నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు పెద్దబజారు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, పెద్దబజారు, మెయిన్‌రోడ్డు మీదుగా బోయివీధి, గొల్లవీధి, రొట్టెల వీధి, చిన్నబజారు, తోట వీధి ప్రాంతాల్లోని రామాలయాలను సందర్శిస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం నెహ్రూ ఉన్నత పాఠశాల వద్దనున్న రామాలయానికి చేరుకుని, అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు. రామ భక్తులంతా పాల్గొనాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



టి.నగరపాలెంలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

తగరపువలస: త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక - విజయరాంపురం ఆధ్వర్యంలో ఆదివారం భీమిలి మండలం టి.నగరపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా వేమన పద్యాలలోని జ్ఞానం గురించి గ్రామీణులకు వివరించారు. కమిటీ సభ్యులు కె.త్రినాథరావు, ఎస్.శ్రీనివాస్, వి.భవానీ, కె.సురేష్, కె.రాజు, బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల శాంతి కల్యాణం

సింహాచలం: సింహగిరిపై గంగధార వద్ద ఉన్న పురాతన సీతారామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న కల్యాణంతో పాటు ఇతర పూజల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఈవో కోరారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- అన్ని ప్రాంతాల్లోనూ ప్రభుత్వానికి విశేష ఆదరణ
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- బక్కన్నపాలెంలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బక్కన్నపాలెంలో సంక్షేమ పథకాల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: భీమిలి నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో తమకు ప్రజల నుంచి అపూర్వమైన ఆదరణ లభించిందని, ఇది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం సాయంత్రం అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ముందుగా ఆయన బక్కన్నపాలెం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆఖరులో కార్యక్రమం ముగింపు సందర్భంగా కేక్ కట్ చేసి పలువురిని సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో పలు నివాసాలు, అపార్ట్‌మెంట్ల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా జరిగిన మేలుకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు మరింత తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసిన సంతృప్తి దక్కిందన్నారు. నిత్యం ప్రజా సంక్షేమం కోసం పరితపించే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఈ సందర్భంగా రామాలయం వీధిలో మురుగు నీటి ప్రవాహానికి చర్యలు చేపట్టాలని, వీధిలైట్లు వెలిగించాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

127 సచివాలయాల్లో కార్యక్రమం

'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని 2022 మే నెలలో భీమిలి నియోజకవర్గంలోని అన్నవరం గ్రామంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆదివారం నాటికి 127 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం పూర్తి చేశారు. దాదాపు అన్ని గడపలకూ వెళ్లి ప్రజలను పలకరించారు. వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలతో అదనంగా ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. కార్యక్రమంలో జీవీఎంసీ చీఫ్ విప్, వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, ఏఈ సురేష్, 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, సచివాలయ కన్వీనర్ రాయిన సాయి, సియాద్రి కనకరాజు, పెంద్ర అప్పన్న, పిళ్లా రమణ, పలివెల రవి కుమార్, వై.అప్పారావు, జగ్గుపిల్లి నరేష్, వాండ్రాసి సూరి అప్పారావు, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ శోభాయాత్ర



మధురవాడలో శ్రీరామ శోభాయాత్ర ప్రారంభంలో భక్తులు

మధురవాడ: అయోధ్య శ్రీరామ మందిరంలో బాల రాముని విగ్రహం సోమవారం ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ ఆదిత్య ఫార్చ్యూన్ టవర్స్ వాసులు శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాముని చిత్రాలు ఉన్న కాషాయి వస్త్రాలు, టోపీలు, జెండా ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. చిన్నారులు బాలరాముని విగ్రహం తలపై పెట్టుకుని, మరో ముగ్గురు సీత, రాముడు, ఆంజనేయుడు వేషాలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ర్యాలీ ఖుషి షాపింగ్ మాల్, గాంధీ సర్కిల్ మీదుగా వుడా కాలనీ 100 అడుగుల రోడ్డుల్లో సాగింది. జై శ్రీరామ్ నినాదాలు, రామ నామ సంకీర్తన చేస్తూ నిర్వహించిన శోభాయాత్ర భక్తి భావం నింపింది. అక్షింతలు పంపిణీతోపాటు సోమవారం బాల రాముని ప్రాణ ప్రతిష్ట వరకు 5 రోజులపాటు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, నిరంజన్, పద్మిని, అజయ్, వాసు, సాయిబాబు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు జన్మదిన వేడుకలు



గిరిబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంపీపీ రాంబాబు, లక్ష్మణరావు

పద్మనాభం: జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు జన్మదిన వేడుకలు పద్మనాభంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిబాబు కేక్ కట్ చేశారు. గిరిబాబుకు ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గిరిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సుంకర బంగారప్పడు, అముజూరి అప్పారావు, తాలాడ పద్మనాభం, బూసురోతు అప్పారావు, ఉప్పు సూరిబాబు, రామసింగు ముత్యాలనాయుడు, ఈర్ల ఈశ్వరావు, కోన రమణ, మామిడి శివ రామ కృష్ణ, కోరాడ రామేశ్వరరావు, బోని సన్యాసినాయుడు, బొలె అప్పలనాయుడు, సుంకర నారాయణరావు పాల్గొన్నారు.

తాజుద్దీన్‌బాబా జయంతి వేడుకలకు సన్నాహాలు



ఆశ్రమంలో తాజుద్దీన్‌బాబా చిత్రపటం



దాకమర్రిలో తాజుద్దీన్‌బాబా ఆశ్రమం

26 నుంచి 28 వరకు నిర్వహణ

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పంచాయతీలోని నీలయమ్మ సత్రం కూడలిలో తాజ్ ఆశ్రమంలో ఈ నెల 26 నుంచి 28 వరకు మూడు రోజులపాటు హజరత్ తాజుద్దీన్‌బాబా 163వ జయంతి వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. వీరంతా బాబా ఆస్థానంలో పువ్వులు, చందనం, శాలువాలు సమర్పిస్తారు. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా ఉత్తరాంధ్ర ప్రజలకు నిర్వాహకులు ఆహ్వానం పలుకుతున్నారు. 26న సాయంత్రం 5 గంటలకు ఆశ్రమం వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ ఎ.తిరుపతిరెడ్డి బాబా పతాకావిష్కరణతో జయంతి వేడుకలు ప్రారంభమవుతాయి. 27న ఉదయం 9 గంటల నుంచి ఉత్తరాంధ్ర ప్రముఖులు, భక్తులు బాబా ఆస్థానంలో భక్తిశ్రద్ధలతో చందనం సమర్పిస్తారు. అదే సమయంలో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి మహమ్మద్ షార్ఫుద్దీన్, ఛత్తీస్‌ఘడ్‌లోని డోంగర్‌ఘడ్ ఖాదర్‌వల్లీ బాబా ఆస్థానం నుంచి చాదర్ సమర్పిస్తారు. ఈ సందర్భంగా భక్తులు మేళతాళాలు, బాణసంచా, నేలవేషాలు, పులివేషాలు, కోలాటంతో ఆస్థానానికి చేరుకోనున్నారు. 27న బాబా ఆస్థానం వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆయన మహిమలను కొనియాడుతూ ప్రత్యేక ప్రార్థనలు, ఖవ్వాలీ నిర్వహించనున్నారు. 27, 28న ఆశ్రమం ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహిస్తారు. వివరాలకు డి.రాజు కుమందన్‌ను 94907 78699 నంబరులో సంప్రదించవచ్చు.

తగ్గిన ముగ్గురు అమ్మవార్ల ఆదాయం

విస్మయం వ్యక్తం చేసిన భక్తులు



సర్వీస్‌రోడ్డులో బస్సులు, భారీ వాహనాలు



ఆలయం ముందు జాతీయ రహదారి, సర్వీస్‌రోడ్డు మధ్య రెయిలింగ్



సంగివలస జాతీయ రహదారిని ఆనుకుని ముగ్గురు అమ్మవార్ల ఆలయాలు

తగరపువలస: జాతీయ రహదారిని ఆనుకుని సంగివలస వద్ద కొలువై ఉన్న ముగ్గురు అమ్మవార్లు అలియాస్ పోలమాంబ ఆలయ ఆదాయానికి ఇటీవల భారీగా గండి పడింది. గతంలో సగటున రోజుకు ఈ ఆలయాలకు రూ.10 వేల వంతున హుండీ ఆదాయం లభించేది. నిర్ణీత కాలంలో హుండీల లెక్కింపు సమయంలో రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల పైచిలుకు ఆదాయం లభించేంది. ఆశ్వయుజ, కార్తీకమాసాలతోపాటు ఆలయాలకు వార్షిక వేడుకలు నిర్వహించే సమయంలో ఈ ఆదాయం ఎక్కువగా ఉండేది. కానీ ఇటీవల చేపట్టిన హుండీల లెక్కింపులో ఆదాయం రూ.2 లక్షలకే పరిమితం కావడంతో పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం తగ్గడానికి కారణాలు విశ్లేషించాలని కోరుతున్నారు. సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపం, ఆలయం ముందు సర్వీస్ రోడ్డు, జాతీయ రహదారి మధ్య రెయిలింగ్ కారణమని పలువురు భక్తులు అంటున్నారు. ప్రధానంగా జాతీయ రహదారుల విస్తరణ తర్వాత రెయిలింగ్ నిర్మాణంతో భక్తుల రాకపోకలు గణనీయంగా తగ్గినట్టు భావిస్తున్నారు. దీనికితోడు ఆలయం ముందు సర్వీస్‌రోడ్డుపై బస్సులు, భారీ వాహనాల రాకపోకలు కూడా ఆలయ ఆదాయంపై ప్రభావం చూపుతున్నాయంటున్నారు.

అమ్మవార్లు పవర్‌ఫుల్.. ఆదాయం నిల్..

ఉత్తరాంధ్ర ముఖద్వారంలో వేంచేసి ఉన్న పోలమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబ అమ్మవార్లను కొత్తమ్మవారి పేరుతో కూడా పిలుస్తారు. ఈ మార్గం ద్వారా ఉత్తరాంధ్రకు రాకపోకలు సాగించే వారితోపాటు ప్రముఖులు దర్శించుకుంటారు. పదేళ్లక్రితం ఈ ఆలయాల విస్తరణ పనులతోపాటు కల్యాణ మండపం నిర్మించనున్నట్టు దేవాదాయశాఖ ప్రకటించినా సాకారం కాలేదు. ఏటా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి నిర్వహించే తెప్పోత్సవం కూడా కోవిడ్ - 19 తర్వాత నిలిచిపోయింది. ఆలయ ఈవో పరిధిలో వందలాది ఎకరాల ఆస్తులు ఉన్నా వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో నిత్యం ఎక్కడో ఒకచోట ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఆలయ పర్యవేక్షణపై దృష్టి సారించి ఆదాయాన్ని పెంచే మార్గాలు పునరుద్ధరించి ఆస్తులను పరిరక్షించాలని అమ్మవార్ల భక్తులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు సోమవారం నాయకులు శంకుస్థాపన చేశారు. తర్లువాడ పంచాయతీ నగరప్పాలెం గ్రామంలో రూ.18 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి, ముచ్చర్ల పంచాయతీ గొంపవానిపాలెంలో రూ.10 లక్షలతో పాఠశాల భవనం నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు బీఆర్‌బీ నాయుడు, షిణగం యర్రయ్య, ఎంపీటీసీ సభ్యుడు బంక ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా నగదు అందజేస్తున్న కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు జీవీఎంసీ 4వ వార్డు గొల్లల తిమ్మాపురం ప్రాంతానికి చెందిన ఎల్.అప్పయమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆమెకు వైఎస్సార్ బీమా వర్తించింది. ఆమె కుమార్తెకు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు తక్షణ సహాయం కింద రూ.10 వేలు ఆదివారం అందజేశారు. మిగిలిన రూ.4.9 లక్షలు బ్యాంకు అకౌంటులో జమ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మేరుగు చిన్నారావు, కొయ్య అప్పలనాయుడు, బుద్దల అప్పలనాయుడు, సూరాడ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రవచనాలు



ప్రసంగిస్తున్న వేదవ్యాస ప్రియస్వామి మహారాజ్

కొమ్మాది: సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా పర్యటిస్తున్న నేపథ్యంలో వేద వ్యాస ప్రియ స్వామి మహారాజ్, జయద్వైత స్వామి మహారాజ్ నాలుగు రోజుల నుంచి సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో నిర్వహిస్తున్న సనాతన ధర్మం ప్రచార ప్రవచనాలు ఆదివారం ముగిశాయి. అయోధ్యలో రామ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా వేద వ్యాస ప్రియస్వామి మహారాజ్ రామలీలలపై ప్రవచనాలు చేశారు. రాముడు మానవాళికి ఎలా జీవించాలో, ఎలా నడుచుకోవాలో ఆచరించి చూపించిన మహానుభావుడని పేర్కొన్నారు. సేవ ఒక్కటే రాముడిని మనిషికి దగ్గర చేసే మార్గమని వివరించారు. సోమవారం ప్రతి ఒక్కరూ రామనామ సంకీర్తన చేసి శ్రీరాముని స్వాగతించాలని సూచించారు. కార్యక్రమంలో ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని పాల్గొన్నారు.

జాక్సాకు విద్యార్థినుల అభినందన



జాక్సాకు అభినందనలు తెలుపుతున్న కేజీబీవీ విద్యార్థినులు, సిబ్బంది

భీమునిపట్నం: జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ జాక్సా చంద్రునిపై విజయవంతంగా లూనార్ ల్యాండర్‌ను దింపడంతో స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులు సోమవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రిన్సిపాల్ గంగా కుమారి మాట్లాడుతూ ఈ ఘనతను సాధించి మన భారతదేశం నాలుగో స్థానంలో నిలవగా... ప్రస్తుతం జపాన్ 5వ స్థానంలో నిలిచిందన్నారు. ఇటువంటి ప్రయోగాలు విజయవంతం కావడం వల్ల సాంకేతిక పరిజ్ఞానం మరింత మెరుగుపడుతుందని, మరిన్ని కొత్త ప్రయోగాలు చేయవచ్చన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుడ్ల పోలిరెడ్డి

కొమ్మాది: భీమిలిలో ఈ నెల 27న నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బహిరంగ సభకు జీవీఎంసీ 8వ వార్డు నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ముఖ్య నాయకులతో గుడ్లవానిపాలెంలో సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణులకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నారని, ప్రతి ఒక్కరూ తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, చెన్నాదాసు, ముదుండి రాజేశ్వరి, నొడగల రాంబాబు, మాదుచంటి పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

అలవోకగా 150 పద్యాల ఆలాపన



డాక్టర్ పెదవీర్రాజును సన్మానిస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ అంకోశ హాల్‌లో తెలుగు పద్య సౌరభం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదరకోశ వ్యాధుల వైద్య నిపుణుడు డాక్టర్ ఈదర పెదవీర్రాజు ప్రముఖ కవులు రాసిన పద్యాలను అలవోకగా ఆలపించారు. 150 పద్యాలను ఏకధాటిగా చదివి కవులు, రచయితలను ఔరా అనిపించారు. గణనాథుడి పద్యంతో మొదలై 150 పద్యాలు చదివి వినిపించారు. సమకాలీన అంశాలను ఆధారంగా చేసుకొని ఆయన ఇంత వరకు పలు కవితలు రాశారు. తెలుగు భాష, పద్యాలపై తనకున్న పట్టుతో నన్నయ్య, తిక్కన, తిరుపతి వెంకట కవులు, దాశరథి తదితర కవుల నుంచి వచ్చిన పలు పద్యాలను, వాటి సారాంశాన్ని డాక్టర్ పెద వీర్రాజు చదివి వినిపించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తనదైన శైలిలో ఆయన వినిపించారు. డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పెద వీర్రాజు, ముఖ్య అతిథి డాక్టర్ మీగడ రామలింగస్వామిలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

తులసి మొక్కలు, ప్రమిదలు పంపిణీ



తులసి మొక్క, ప్రమిదలు అందిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

ఆనందపురం: మండలంలోని పొడుగుపాలెంలో ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా తులసి మొక్కలు, ప్రమిదలు పంపిణీ చేశారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా వీటిని అందించినట్టు తెలిపారు. మహిళలంతా కలిసి సంకీర్తన చేశారు. తమ్మిన నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్



పాత నేరస్తులతో మాట్లాడుతున్న క్రైం ఎస్‌ఐ సూర్యప్రకాశరావు

భీమునిపట్నం: పలు చోరీలు, నేరాలకు పాల్పడిన పాత నేరస్తులకు భీమిలిలోని క్రైం పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. క్రైం ఎస్‌ఐ సూర్యప్రకాశరావు 20 మంది పాత నేరస్తులను పిలిపించి మాట్లాడారు. మళ్లీ నేరాలకు పాల్పడవద్దని సూచించారు. నేరాలకు పాల్పడితే జీవితాలు నాశనమవుతాయని, జీవితమంతా కేసుల కోసం కోర్టుల చుట్టూ తిరిగేందుకు సరిపోతుందని, అందుకే వాటిని వదిలేయాలని కోరారు. సరైన మార్గంలో జీవనం సాగిస్తే సమాజంలో గౌరవం లభిస్తుందని సూచించారు.